★ మహాలక్ష్మి చేసిన తప్పు ★

శ్రీమతి చిన్నమ్మాయి

మహాలక్ష్మి నలుగురు మగవాళ్ల సందున పుట్టిన ఒక్కగా నొక్క కూతురు కనుక ఆమెను అన్నతమ్ములంతా అమిత గారాబంగా చూస్తూవచ్చారు తల్లి తండ్రులతో బాటు. అంత మాత్రాన మహాలక్ష్మి అల్లరి చిల్లరగా తిరిగి ఎవరి మనసులకును ఎటువంటి బాధనూ కలిగించలా. వినయ విధేయలతో చిన్నతనంలోనే సంచరిస్తూ వస్తున్న మహాలక్ష్మిని చూచి ఇంట్లోవాళ్లే కాక వూళ్లో వాళ్లుకూడా మురిసిపోయేవారు. ఒక్క కూతురైతే మాత్రమేం అటువంటి బిడ్డను కన్నందుకు నర్సయ్యా, నర్సమ్మలు అదృష్టవంతులన్నారు అందరు.

మహాలక్ష్మికి యుక్తవయస్సు వచ్చేసరికి నర్సయ్యా భార్యతోసహా పరలోక యాత్ర చేశాడు, వివాహాలైన నలుగురు కొడుకులతో పాటు కూతురును వదలి. చచ్చిపోయే ముందు పెద్దకొడుకుని పిలిచి "మహాలక్ష్మిని నీ బిడ్డమాదిరిగా చూచి దాన్ని ఒకింటి దాన్ని చేయమని" చెప్పాడు. వెంకయ్యా "సరే" నని తలూపాడు.

నర్సయ్యా బీదవాడు అనే విషయం వూరిలోని వారందరికి తెలుసు. అయితే ఆయన ఏనాడు తిండికి కొంచెముకూడా బాధ నిరుత్సాహం, నిస్పృహా చెందకుండా నిత్యం ఒళ్లొంచి పనిచేశాడు. కొడుకులు పుట్టక ముందు, తరువాత బిడ్డలకు ఈడొచ్చేసరికి, వారిని జీతాల్లకు కుదిర్చాడు. అక్కడనుండి ఆయనకు కొంచెం విశ్రాంతి లభించసాగింది. మొత్తంమీద కొడుకులు సంపాదించిన దానితోనే వారి నలుగురికి సక్రమంగా పెండ్లిండ్లుచేసి వాళ్లను ఒక ఇంటివాళ్లగాచేసి మరిపోయాడు.

నర్సయ్యా కొడుకులు నలుగురు తండ్రి చనిపోకమునుపే విడిపోయారు. పెద్ద కొడుకు వెంకయ్యకు తనదగ్గరవున్న రెండు వందల రూపాయలు కూతురుతో పాటు ఇచ్చి పోయాడు కాబట్టి మహాలక్ష్మి ఇప్పుడు పెద్దన్న దగ్గరనే వుండసాగింది. అన్నను గౌరవించినరీతిగానే పేరమ్మను కూడా గౌరవించసాగింది. పేరమ్మకూడా మహాలక్ష్మినికన్న కూతురుగానే చూచుకోసాగింది.

కొన్ని నెలలు గడవకుముందే వెంకయ్యా సంసారంలో కలతలు మొలకలెత్త సాగాయి. వెంకయ్యా ఒక్కడే సంపాదించుకొచ్చింది ఈ కరువుకాలంలో వారి సంసారానికి చాలటం కష్టమైంది. ఈ విషయం అన్న చెప్పక పోయినా వదిన అనకపోయినా మహాలక్ష్మి గ్రహించింది. ఒకనాడు వెంకయ్యా దగ్గరికి వెళ్లి "అన్నయ్యా! నేనుకూడా కూలికి

వెళ్తా. నీ వొక్కడవు తెచ్చిపెట్టుంటే మేం తింటూ కూర్చుంటే ఏమాత్రంకూడా మనం ముందుకు సాగలేం" అంది వినయంగా.

"ఆ - ఎందుకమ్మా! నీవు కూలికి వెళ్లుట, నీమనస్సుకేమైనా వ్యథ కలిగేటట్లు నేను కాని, మీ వదిన కాని అనలేదు కదా!"

"నిన్నటి దాకా కూలిచేసిన దాన్నేగా. నేనేమైనా సుకుమారంగా పెరిగిన దాన్నైతే చేయలేనని భయం. కష్టజీవులకు పనిచేయుట యంటె భయంకాదు. వారికి కష్టం ఎప్పుడూ ఒకేరీతిగా వుంటుంది. వారికీ దానిలో, కొత్తకాని, అధికంకానికనపడదు. నన్ను వదినకాని, నీవు కాని ఒక్కమాటకూడా అనలేదని నేచెప్పేకన్నా చూచినవాళ్లే అనుకుంటారు. అయితే ఏమంటావు అన్నయ్యా!"

"చూద్దాము. కొంచెం నిదానించు" అన్నాడు అయిష్టతను దాచిపెడ్తూ వెంకయ్య.

వెంకటరత్నంగారంటే ఆ వూరిలో గొప్ప ఆస్థిపరుడని ఆ చుట్టుపట్ల నాలుగైదు వూళ్లకి తెలుసు. ఆయనకు చక్కని భవంతి, ఒక గొడ్ల చావడి (పెంకుటి) కూడ వుంది. అయన క్రింద అనేకమంది పనివాళ్లున్నారు పనులు చేస్తానికి. అంత ధనవంతుడైనా అయనఅంటే అందరికీ అసహ్యమే కాని ఎవరు దాన్ని పైకి పొంగనీయలా—మనస్సుల్లోనే ద్వేషించసాగారు చిన్నా పెద్దా అంతా. బిచ్చగాడికి పిడికెడు మెతుకులు వేయించిన పాపాన ఏనాడు పోలా. పైగా అడుక్కొనే వాళ్లువస్తే వాళ్లజోలెలు లాక్కొని వాళ్లచేత ఏమైనా పనులు చేయించుకుంటాడు. అందువల్ల ఆ యింటి ప్రాంతాలకు బిచ్చగాళ్లెవరూ రారు.

భార్య చచ్చిపోయేసరికి వెంకటరత్నం వయస్సు సుమారు ఏబదిఐదు సంవత్సరాలుంటాయి. నలుగురు ఆడపిల్లలు ముగ్గురు మగబిడ్డలువున్న కారణంగా మళ్లా వివాహం చేసికోటానికి కొంచెం జడిశాడు. అంతేకాని ఎవరూ పిల్లనూ ఇవ్వరనేభయం ఆయనకు ఏకోశానలేదు, మరొక విషయమేమిటంటే ఆస్థి ఈ పిల్లలకు చాలదనే భావం ఆయనలో గాఢంగా నాటుకుపోయింది. అసలు ఈ కారణంవల్లనే పెళ్లి చేసికోనన్నాడు ఎంత మంది చెప్పినా. ఆయనీ విషయంలో అందరూ అనేక విధాలుగా చెప్పుకోసాగారు.

వెంకటరత్నానికి ఇప్పుడు ఇంట్లో పనులు చక్కపెట్టడం మహావస్థగావుంది. ఎలాగైనా 'ఇల్లాలులేని ఇల్లు చమురులేని దీపమే.' ఏవస్తువు ఎక్కడ పెట్టాలో, ఏది ఎలా చేయాలో (ఇంటిలో) అది ఒక్క స్త్రీకే చేతవుతుందిగాని మరెవరికి సాధ్యం కాదు. అందులో పెద్దపెద్ద ధనవంతుల ఇళ్లలో మరీ దుస్సాధ్యం. ఈ విషయం గ్రహించాడు వెంకటరత్నం. ఒక పని

మనిషిని పెట్టుకుంటేనేకాని తన కుటుంబం బాగుపడదనుకున్నాడు. మగపిల్లలు ఆడ పిల్లలకన్న పెద్దవాళ్ళైకాని వాళ్లు ఒక్కపని కూడా చేయరు. తల్లి వున్నంతవరకు కొద్ది కొద్ది పనులు చేయటానికి చిన్నపిల్లను ఒక దాన్ని పెట్టుకున్నారు. జీతం సరిగ్గా ఇవ్వని కారణంగా ఆ అమ్మాయి సరిపించుకుంది. ఇప్పుడు మళ్లా అవసరమైంది. ఇదివరకటికన్న ఇపుడు ఎక్కువ అవసరం. పిల్లలవల్ల కానిపనులు అనేకాలున్నాయి.

వెంకయ్య ఒక సంవత్సరం వెంకటరత్నం దగ్గర పనిచేశాడు పాలేరుగా. అప్పుడు అతనిమీద ఆ నమీద బాగా నమ్మకం కుదిరింది. అభిమానంకూడా ఏర్పడింది. మరుసంవత్సరంకూడా వుండమంటే జీతం చాలదని విరమించుకున్నాడు. అప్పటి నుండి వెంకట రత్నానికి వెంకయ్య వాళ్ల కుటుంబంపైన ఒక విధమైన గురి ఏర్పడింది.

మహాలక్ష్మి బలవంతంపైన వెంకయ్య ఒప్పుకున్నాడు వెంకట రత్నంగారింటిలో పనిచేస్తానికి. పేరమ్మకుకూడా ఇష్టంలేదు మహాలక్ష్మి పనిచేయటం. అయినా మహాలక్ష్మి "ససేమిరా" అని పట్టు పట్టింది. "సరే! జాగ్రత్తగా తిరుగుతూ పనిచెయ్యి. ఏ పొరబాటు చేయకండా స్వంత గృహంలో పనిచేసినట్లు పనిచేసి మనకు అపనిందతేబోకు. నలుగురు నోళ్లల్లో నానేటట్లు చేయవద్దు" అని బుద్ధులుగరపి చెల్లెల్ని వెంకటరత్నంగారింటిలో కుదిర్చాడు వెంకయ్య. వెంకయ్య మొదట సంతోషించకపోయినా తరువాత సంతసించాడు చెల్లెలు నీడపట్టున సుఖపడుతుందని పాపం.

మహాలక్ష్మిమీద మాతృప్రేమకోసం తహతహలాడిపోయే పిల్లల లేతహృదయాలకు మమకారం ఏర్పడింది. ఆమెను గౌరవంగా పిలుస్తూ, మర్యాదగా పనిచేయించుకుంటూ వచ్చారు. మహాలక్ష్మికూడా పిల్లలను ఏలోపంలేకుండా చూడసాగింది. వెంకటరత్నం తన కుటుంబాన్ని చక్కగసరిదిద్దిపెట్టే పనిమనిషి లభించినందుకు అమితంగా ఆనందించాడు. మెల్లమెల్లగా ఆమెమీద అనుమానం దూరమైంది, అభిమానం ఎక్కువైంది.

సాఫీగా నడచిన కాలశకటం ఒడుదుడుకుల్లో ప్రవేశించింది. ప్రయాణం ప్రయాసగావుంది. వెంకటరత్నం బుర్రలో చీడపురుగు చేరింది. బుద్ధిపెడత్రోవకు బయలైరింది. ఇది సహజమే - భార్యలేదు. అందులో రుచులెరిగిన వ్యక్తి, అదిగాక కళ్లెదుట మెరపుతీగెలాంటి యౌవనవతి వుంది. మరికళ్లు జిగేలు మనక ఏంచేస్తాయి! మహాలక్ష్మిమీద వెంకటరత్నానికి చెడు అభిప్రాయం ఏర్పడింది. జారిపోయిన నల్లని చిన్నిపూస దొరకటం దుర్లభం. ఇక ఆ సంవత్సరంతో ఆఖరు - మహాలక్ష్మికి పెండ్లి చేయాలనుకుంటున్నారు. రెండు

సంవత్సరాలనుండి పనిచేస్తుంది. ఇంతవరకు తాపాన్ని సహించి వూరుకున్నాడు. ఇక వుండలేకపోయాడు. "మహాలక్ష్మీ! నిన్నో కటి అడుగుతాను ఏమనుకోవుగా" అన్నాడు మెల్లగా వంటిగదిలో పనిచేసు కుంటున్న మహాలక్ష్మిని సమీపించి.

"ఏమిటండి! అది చెప్తే నావల్లనైతే కాదంటానా" అన్నది కూర్చున్నదల్లా లేస్తూ.

"పరవాలేదు కూర్చోలే! ఏమీలేదు- నిన్ను చూస్తుంటే నాకు ఒక విధమైన ప్రేమ పుట్టుకు రాసాగింది. నిన్ను ఎన్నో సార్లు అడుగుదామని వచ్చానుకాని అడగ లేకపోయా" అని మెల్లగా గొణగసాగాడు. ఆయన మాటలు మహాలక్ష్మికి సరిగ్గా అర్థం కాలా. ముభావంతో నిండిన మాటలను అర్థంచేసుకోలేక పోయిందా అమాయకు రాలు. "మీరనేదేమిటో నాకు సరిగ్గా తెలియలా. అసలు విషయమేమిటో వివ రంగా చెప్పండి" అంది విసుగ్గా. "ఏమీ లేదు నిన్ను ... ... అనుకున్నా, ఏమం టావు నామాట కంగీకరించావంటే నీవేది కోరితే అది చేయించిపెడ్తా-సరేనా!"

మహాలక్ష్మి ఇపుడు తెలుసుకుంది వెంకట రత్నం వుద్దేశం. ఆయన అటువంటి మని షని ఇదివరకెప్పుడూ అనుకోలా. కలలో కూడా ఆయన మంచివాడు కాదని ఆమె తలంచలా. చర్రున కోపం వచ్చింది. నెత్తురు గడ్డకట్టింది. ఇక వుండలేకపోయింది.

"మీరిప్పుడంటే అన్నారుకాని మరెప్పు డన్నా అనేరు. నేను కూటికి పేదనైనా శీలానికి పేదనుకాను. నేనెప్పటికి అంగీక రించను ఆ విషయానికి. మీబిడ్డగా భావించి నామీదనున్న వాంఛను త్రుంచివేసికోండి" అని బ్రతిమిలాడింది.

'మహాలక్ష్మీ! కాళ్లదగ్గరకొచ్చిన పెన్ని ధిని తృణప్రాయంగా నీకాళ్లతోనే తన్నివేస్తు న్నావు. ఒక్కసారి "ఊ' అన్నావంటే నీవు యావజ్జీవం సుఖపడ్తావు. లేకపోతే..."

"లాభంలేదు, నన్ను కనికరించి నామీద కక్ష కట్టకండి. మిమ్మల్ని ప్రార్థిస్తున్నా."

"నామాట కాదన్న తిరస్కరించి నాకు కోపాన్ని తెప్పించావంటే నీగతి ఏమవా తుందో ఆలోచించావా మహాలక్ష్మీ!" అన్నాడు కోపంగా.

అనేక విధాల బ్రతిమిలాడింది, ప్రార్థిం చింది, కోపించింది, ద్వేషించింది. ఎన్ని ప్రయత్నాలుచేసినా వెంకటరత్నం పాషాణ హృదయం కరగలా.

"ఇప్పుడేం కాదు. ఇంకా రెండురోజులు గడువు ఇస్తున్నా, బాగా ఆలోచించుకో" అంటూ వెళ్లిపోయాడు విసురుగా వెంకట రత్నం.

మహాలక్ష్మి బాగా దీర్ఘంగా ఆలోచిం చింది; ఉపయోగం కనపడలా. ఎంత ప్రార్థిం చినా వినేటట్లు కనపడలా. ఇక అక్కడవుంటే మానభంగం జరుగుతుంది. అదితప్పదు. అందు వలన వెంటనే ఇంటికి వెళ్లిపోయింది దిగులుగా

శ్రీరాములుగారు ఆవూరికి పెద్ద. ఆయనమాట దాటిపోవటానికి ఎవరికీ ధైర్యం లేదు. తప్పుకాని ఒప్పుకాని ఆయన చెప్పినట్లు వినాలి. ఆయన కచేరి అరుగుమీద కూర్చుని తీర్పు చెపుతుంటే అందరూ తలొగ్గేవారేకాని తలెత్తేవాళ్లు లేరు.

శ్రీరాములూ, వెంకటరత్నం వరుసకి బావా బావమరుదులు అవుతారు. కాని వెంకటరత్నంకన్న శ్రీరాములు కొంచెం నయం.

శ్రీరాములుగారు వెంకయ్యను కచేరి అరుగు దగ్గరకు పిలిపించాడు రెండవరోజు సాయంత్రం.

వెంకయ్య రాగానే "వెంకయ్యా! నీ చెల్లెలు ఇప్పుడు వెంకటరత్నంగారింటిలో మానుకున్నది ఎందుకు?" అని ప్రశ్నించాడు శ్రీరాములుగారు. వెంకయ్య చెప్పాడు వెంకటరత్నం చేసినపని. అది సాంతం చెప్పకముందే "ఇక ఆపు నీ మాటలు. వెంకటరత్నం అటువంటివాడు కాదని నీకెలా తెలియలా!? నీ చెల్లెలు చేసినపని వేరు. వంకెన చొక్కా జేబులో పెట్టినడబ్బు కాజేసి ఈ ఉపాయం పన్నింది తెలుసా? తెలిసే తెలియకుండా అలా చెప్పావంటే మర్యాదగా వుండదు జాగ్రత్త" అన్నాడు కోపంగా శ్రీరాములు. "మా అమ్మాయి అటువంటిది కాదండి" అన్నాడు వినయంగా. "అయితే వెంకటరత్నమేనా అటువంటివాడు" అన్నాడు ఎద్దేవగా. వెంకయ్య ఇక ఎంత చెప్పినా లాభంలేదనుకున్నాడు. తనకు న్యాయం దొరకటం కష్టమేనని నిశ్చయించుకున్నాడు. శ్రీరాములుగారు చెప్పింది తీసివేయడానికి ఎవరికి చేతకాదని తెలుసుకున్నాడు.

"వెంకటరత్నం ఎంతడబ్బు పోయింది నీ జేబులోది?" అని ప్రశ్నించాడు వెంకటరత్నంవైపుతిరిగి శ్రీరాములు.

"నలభై రూపాయలండి. పదిరూపాయలనోట్లు నాలుగుకలిపి జేబులో పెట్టి చొక్కా వంకిన తగిలించా. ప్రొద్దున చూచుకుంటేలేవు. మాపిల్లలు అటువంటి వాళ్లుకారు. ఇంతవరకు ఎప్పుడూ చేయని వాళ్లు ఇప్పుడు చేస్తారా? ఇది తప్పకుండా మహాలక్ష్మి చేసినపని" అన్నాడు. అందరికి నమ్మకం కుదిరేటట్లు వెంకటరత్నం.

"ఏమోయి వెంకయ్యా! దీనికి నీవేమంటావు? ఆ ఇంట్లోకి ఇంకా పరాయి వాళ్లు ఎవరూ పోరాయె. అటువంటప్పుడు ఆ డబ్బు ఎగిరిపోతుందా! నీవే చెప్పు."

"మీరే చెప్పండి న్యాయం" అన్నాడు వెంకయ్య ఇక ఏంచెప్పినా వృథాయని.

"న్యాయమేముంది, మీ చెల్లెలు కాజేసినట్లు స్పష్టంగా తెలుస్తుంటే. కాబట్టి ఆ నలభై రూపాయలు తీసికొచ్చి రేపు ఇచ్చెయ్యండి. లేకపోతే బాగుండదు" శ్రీరాములుగారి "తీర్పు"కు అంతా సంతోషించారు, వెంకటరత్నంతోపాటు. ఆయన్ని "న్యాయమూర్తి" అన్నారు. వెంకయ్య మాత్రం న్యాయం దొరకనందుకు విచారించాడు పాపం.